# కరువుజీవాలు

శ్రీ బి. నాదమునిరాజు

కదలబోయే రైలును గప్పున అందుకున్నాను. తిండికి లేక కరువు పిశాచి భయంకరమైన రాక్షసిలాగా వెంటాడుతుంటే బ్రతికేందుకోసం తుంగభద్ర ప్రాజెక్టు వద్దకు వలసపోయే కష్టజీవులతో రైలు నిండివుంది. పీక్కుపోయిన ముఖాలతో, నిరాశ పూరితమైన నయనాలతో, సంస్కారంలేని జుత్తులతో దరిద్రదేవత ప్రియసంతానంలా వున్నారువారు. కూర్చునేందుకు తావులేకపోవడంతో వాకిటి వద్దనే నిలుచుని పెట్టె నంతటిని పరిశీలించాను. ఒక సీటు నంతటిని ఆక్రమించుకొని బిర్రబిగుసుక పడుకున్నాడు ఒక కాకి దుస్తుల స్థూలకాయుడు. మరో సీటులో భార్యా బర్తలు గావాల్ను కూర్చుని యిద్దరిమధ్య వుండే తమ శిశువుతో కేరింతలాడుతూ గ్లూకోస్ బిస్కట్లు తింటున్నారు. మిగిలిన సీట్లు నిండుకు వివిధ రీతుల ప్రయాణికులు యిరుక్కొని కూర్చున్నారు. క్రింద చీమ దూరేందుకు కూడ జాగా లేకుండా తుంగభద్రశరణార్థులు చితికిల బడివున్నారు.

దేశంలోని ఆహారసమస్య, వెలువడిన ఎన్నికల ఫలితాలను, మిశ్రమ మంత్రివర్గ స్థాపనావకాశాలను నెమరు వేసుకుంటూ నిలుచున్న నా ప్రక్కనే కూర్చున్న యిద్దరు కరువు బాధిత స్త్రీలు మాట్లాడుకోవటం మొదలుపెట్టారు. నేను శ్రద్ధగా వినటంలో నిమగ్నుడనయాను.

“యాడమ్మా గతిలేక యెల్తున్నాం. ఆ పాడునీల్లు సరిపడవంట. మొన్న మావూరినుంచి యెల్లొచ్చి బుల్లోడు అదేదో టైఫాయిడ్ జరమంట తిరిగొచ్చి ఆపసోపాలు పడ్తున్నాడు. మారాత ఎట్టుందో.”

“పాడు కాలమొచ్చింది సుబ్బమ్మత్తా. బమ్మయ్య చెప్పినంత జరుగుతూండాది. ఏడూళ్ళ కోవూరు, ఏడుమంది కొకమనిషి అయితారని సెప్పిండంటమ్మా మహానుభావులోరు.”

“అట్ల కాదు, లచ్చింపిల్లా యాభయ్యో పడి నడుస్తుండది గాని, నేనెప్పుడు సూళ్ళేదమ్మా యీ పాడుకరువు. తిన్న తిండిలేకపోతే మానె తాగేటానికి నీల్లుకూడ కరువయిందేం కాలం. ఔరా!” అంటూ ఆ ముసిలామె దవడ నొక్కుకుంది.

ఇంతలోకే నేను జోక్యం కలిగించుకొని వారితో సంభాషణలోకి దిగాను.

“ఏవూరమ్మా మీది?” అన్నాను.

“మాది కడప యిలాకా సోమీ” అంది ముసిలామె.

“మీ ప్రాంతం ఎట్లా వుందమ్మా? పంటలు పండనే లేదా? గింజలధర లెట్లున్నాయ్?” అని అడిగా కుతూహలంగా అక్కడి పరిస్థితి తెలుసుకోవాలని.

“ఏముంది మా రాజా! వానసినుకు యీ ఏటిపొడుగునా రాలిందే వొట్టండి. ఇంక పంటలేం పండుతాయ్. యిత్తనానికేసిన గింజలు కూడ ఎనిక్కి రాలేదండి. ఎల్లేసిన గింజలు అట్లనే పోయినాయ్. మరీ మా పులివెందుల యిలాకాలో అయిదారు ఎకరాల ఆసాములే గాకుండా యిరవైముప్పయి ఎకరాల ఆసాములకు కూడ నాల్గురోజుల బత్తెం లేదంటే నమ్మండి. యింక మా కూలోళ్ళసంగతా? రైతులే వూర్లిడిచి పొయ్యేటప్పుడు యింక మా గతి ఎట్లుంటుందో మీరె సెప్పండి. జీవాలకు మేత కూడా లేదయ్యా. అయినకాడికి అగ్గువ అమ్మకు పారేత్తుండారు పశువుల్ను. తాగేదానికి నీళ్ళకు కూడ కరువు వచ్చిందిసామే ఏం ముదనష్టపుకాలమో. బావుల్లో కడవ మునిగేది మహాగగనమయితే యాడన్నా వుందాండి యీ ఇచిత్రం. మందలు మందలు వూర్లిడిసిపోతుండరయ్యా మనుషులు జీవాల్లా. పులిమీద పుట్రలాగు దానమ్మకడుపు కాలి రోగాలు కూడ యిప్పుడే రావాలి. ఏందిసామీ సదువుకున్నోళ్ళని మిమ్మల్ని అడిగేత్తుండా. కలియుగం అయిపోయివచ్చిందంటనే నిజమేనా? మా వూరి బాపనోయిన మొన్న దేవళంకాడ సెప్పె ‘అల్లరి-చిల్లరి మనుషులంతా ఎదురు మాట్లాడటం నేర్చుకుంటే ఏమవుతుంది పాడుగాక’ అన్నారయ్యా నిజమేనా?” అంది ఆ ముసలామె కంట తడిబెట్టూ. వాళ్లవూరి బ్రాహ్మడి మాటల్లోని యధార్థమును తెలుసుకోవాలనే ఆతురతతో గోటితో నీళ్ళుతుడుచుకుంటూ నావంక చూచింది. నాకు నవ్వాలో ఏడవాలో అర్థంకాక—

“అదంతా వుత్తదిలే అమ్మా. కరువుకూ దానికీ సంబంధం ఏముందీ?” అంటూ, ఆమెకుటుంబ వివరాల్ను అడిగా.

ఆ ముసిలామెకు యిద్దరు కొడుకులు వున్నారనీ పెద్ద అబ్బాయ్ రెడ్డోరింట్లో సేద్యానికి అయిదేండ్లనుంచి నాలుగు తూముల గింజలకు (ఏడాదికి) పనిచేస్తూ వున్నాడని, పదహాయిదేండ్ల చిన్నోడు తను దిన కూలికి దొరికినప్పుడల్లా పోతూ వుండేవాడనీ చెప్పింది. కరువుపాదం మోపగానే రెడ్డోరు ఆ ఏట గింజలు వచ్చే ఏడు పంటలు పండుతే యిస్తానని పెద్దోడ్ని పనిలోంచి తీశేశారుట. తరువాత కూళ్లు దొరికేదే మహాగగనమయిపోయి రోజుల తరబడి పస్తుపడుకోవటం మామూలయిందంట. ప్రభుత్వం గంజికేంద్రాన్ని ఆ వూరికి మూడు మైళ్ళ దూరంలో తెరిస్తే మూడు మూడు ఆరుమైళ్ళు ఆ గ్లాసెడు గంజికి అలాగే నడచి వచ్చేవారట. వున్నట్టుండి పెద్దోడికి జరం రావటం. మంచి మందిప్పించేందుకు కూడ వీలుకాక పోవటం, “అమ్మా గంజి లేదూ!” అంటూ నే

గానకళా బోధిని
గొప్ప సంగీత గ్రంథము. చిన్నలు పెద్దలకు గవర్నమెంటు పరీక్షలకు వుపయోగకరము. సుమారు 800 పేజీలు గల పుస్తకము వెల 10-0-0 పోస్టేజి వేరు
బాలసరస్వతీ బుక్ డిపో కర్నూలు

కుట్టుపని స్వబోధిని (తెలుగు)
"Self Tailoring and Cutting Teacher"
కొత్త పద్ధతిలో కత్తిరించి కుట్టు పావనులు గలది. ప్రతి దర్జీవారికి, స్త్రీలకు ముఖ్యము. 32 పేజీలు 36 పటములుగల పుస్తకము అ. 12 పోస్టుఖర్చులు అ. 5–మహారాజ పుస్తకశాల అరుణాచల మొదలి వీధి, 26 బీటు, మద్రాసు.

ప్రాణం విడవటం జరిగిందట. అంతా తుంగభద్రాప్రాజెక్టు కష్టేచోటుకు వలసబోతూవుంటే తనూ పోతూవుందని తన గాథను ఆ ముసలామె క్లుప్తంగా తన మామూలు భాషలో గద్గదకంఠంతో చెప్పింది.

"అయితే అవ్వా మీకు ప్రభుత్వం ఏమీ సహాయం చేయలా?"

ముసలామె 'అవ్వ' అని నోరు మూసుకుంది, "ఏం సహాయం నాయనా. టోపీలు పెట్టుకొని కార్లలో బుర్రని రావటం మా కరువువైనం తెల్పమని చాల సార్లు రాసుకొని పోవటం. అంతే. యింకేం చేసింద్రు. ముందు అప్పులు యిస్తామని చెప్పింద్రు. తీరాపోతే కూలోళ్లకీమన్నారు పోనీ సన్నకారు రైతులకయినా యిస్తారా అంటే నారాత సిఫార్సులు వుండాలంట. మోతుబరులకే దొరికినయి అప్పులు. మూడేండ్లు తినేన్ని గింజలుండే రెడ్డోరికి మూన్నాళ్లకే అయిదునూర్లు అప్పు యిచ్చింద్రు. కలిగినోళ్ల కాలం అయ్యా. "ఓహో. అల్లాగా" అన్నా గాలికి బొగ్గు వచ్చి కంట్లోపడితే కన్ను నులుముకుంటూ.

అవ్వ యింకా చెపుతోంది. "వీరోళ్లకు గింజలిత్తామంటారు. కంట్రోల్లోకి ఎప్పుడు పోయినా లేవంటారు. మోతుబర్ల కాలం సామీ. తిర్గి ఆకంటోళ్లాయనే రూపాయకు పదిలెక్కన యిస్తాడు జొన్న గింజలు. ఇంక బియ్యం మాటే మరచిపొమ్మంటే నమ్మండి. రెండు నెల్లయింది. మా వరిబువ్వ కండ్లజూసి ఏమో సామీ మా కోటి మారాజులు ఆదేశం ఎల్తే కాగ బతకొచ్చు అంటే పోతూండాం. యిండ్లు వాకిలి యిడిసి ఆ దేశంలో రోగాలు జాస్తి అని బుల్లోడు చెప్పిండు. ఏమో పరమాత్ముడు ఎట్ల రాసుండాడో" అంటూ అవ్వ యింక ఏమో చెప్తూండగానే టికెటు కలెక్టర్ లోపలికొచ్చాడు. మాట్లాడే ముసలామె కొణుకుతూ ఒక మూలకు ఒదిగింది. వలస పోయే జీవాలన్నీ కెదురుతున్నాయ్.

రావడం రావడంతోనే "ఏయ్ మీ టిక్కెట్లేవీ?" అని సింహగర్జన చేశాడు.

"లేవు బాబు. బతకలేక వలస పోతూన్నాం" అన్నాడొకడు వలస పోయే శరణార్థుల్లోంచి.

"మీ బాబుముల్లె వుందనుకున్నార్రా. రైలంతా మీ అబ్బగారి సొమ్ములాగా ఎంతమంది కూర్చున్నారు? దిగండి. దరిద్రగొట్టు ముండాకొడుకుల్లారా." అంటూ ఒకరొకరి రెక్కపట్టి స్టేషన్లోకి దించేస్తున్నాడు. "ముసలి ముండను బాబు" అంది అవ్వ రెక్క పట్టుకోబోతూంటే. హటాత్తుగా నా జేబులోకి చెయిబోయింది ఆమెకేదైనా సహాయం చేస్తామని. రెండణాలన్నర చేతిలో కొచ్చింది అంతే. కనీసం ఆమెకు టిక్కెట్టుకు సహాయం చేస్తామన్నా లేదే అని సిగ్గు నన్ను ముంచేసింది. ఆ రెండణాలన్నర ఆమెకిస్తే ఆ టికెటుకలెక్టరు గుంజుకుంటాడని నాకు తెలుసు కాబట్టి జేబులో వేసుకున్నా కాఫీకయినా వుంటుందని "ఎలా బాబు" అంటూ ఆమె దిగిపోయింది. నాకు కంట్లకు నీరు కమ్మింది. ★

